ఆదివారం తన నివాసంలో ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ రాజన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు

సీఎంతో ఆర్బీఐ మాజీ గవర్నర్ భేటీ

- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, భవిష్యత్తుపై చర్చ

హైదరాబాద్, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డితో ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ రాజన్ భేటీ అయ్యారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఆర్థిక అభివృద్ధికి అనుసరించాల్సిన భవిష్యత్తు వ్యూహాలపై ఇరువురు చర్చించారు. ఆర్థిక పరిస్థితిని మరింత మెరుగు పరిచేందుకు రఘురామ రాజన్ పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లుభట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్ శాంతికుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం కార్యదర్శి శేషాద్రి పాల్గొన్నారు.

మేడిగడ్డపై పూర్తి వివరాలివ్వండి

- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

హైదరాబాద్, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): కుంగిన మేడిగడ్డ బరాజ్‌కు సంబంధించి పూర్తి వివరాలు అందించాలని నీటిపారుదల శాఖ అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఆదివారం తన నివాసంలో నీటిపారుదలశాఖ అధికారులతో సీఎం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో నీటిపారుదల రంగం పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో కొత్తగా నిర్మించిన ప్రాజెక్టుల ఖర్చులకు సంబంధించి పూర్తి వివరాలు అందించాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాలతో జల వివాదాలకు సంబంధించి కృష్ణా ట్రిబ్యునల్ వద్ద వినిపించాల్సిన వాదనలు, ముమ్ముందు ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. యాసంగి పంటలకు నీళ్లిచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. నీటి లభ్యత, ఇతర అంశాలపై పలు సూచనలు చేశారు. అంతర్ రాష్ట్ర జలవివాదాలను త్వరగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో చర్చించిన అంశాలకు సంబంధించి వీలైనంత త్వరగా పూర్తి వివరాలను అందించాలని సూచించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆ శాఖ అధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

త్వరలోనే విచారణ కమిటీ: మంత్రి ఉత్తమ్

తొలుత మేడిగడ్డ పిల్లర్ల కుంగుబాటు, యాసంగి నీటిసరఫరా అంశంపై ఇరిగేషన్ ఉన్నతాధికారులతో రాష్ట్ర సాగునీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. బరాజ్ కుంగిన అంశంపై ఆరా తీయడంతోపాటు, త్వరలోనే విచారణకు ఆదేశిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారని, ఆ మేరకు కమిటీ వేస్తామని మంత్రి తెలిపారు. యాసంగి సాగునీటి విడుదల అంశంపై చర్చించారు.

ప్రభుత్వ ఆస్తులు పెంచాం

- రాష్ట్రాన్ని బంగారుపల్లెంలో పెట్టి ఇచ్చాం
- డబ్బులన్నీ ప్రాజెక్టులకే ఖర్చుచేశాం
- తెలంగాణ అప్పులపై అసత్యపు ప్రచారం
- బీజేపీ, కాంగ్రెస్ రాష్ట్రాల్లో ఎక్కువ అప్పులు
- ఆరు గ్యారెంటీలు విస్మరించిన ప్రభుత్వం
- సీఎం, బండిపై వినోద్‌కుమార్ ఆగ్రహం



ఆదివారం సిరిసిల్లలోని తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 17(నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ప్రభుత్వం ఆస్తులు సృష్టించిందని, తెలంగాణను బంగారు పల్లెంలో పెట్టి అప్పగించిందని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ తెలిపారు. అప్పుల రాష్ట్రమంటూ అసత్య ప్రచారం చేస్తూ, కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను విస్మరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆదివారం ఆయన సిరిసిల్ల లోని తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఎస్‌వోటీఆర్ ప్రాపర్టీ ట్యాక్స్‌లో 84.2% తెలంగాణ సొంత నిధులు ఉన్నాయని, హర్యానా 86.9%తో మొదటి స్థానంలో ఉన్నదని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, గోవా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలన్నీ తెలంగాణ దరిదాపుల్లో కూడా లేవని వివరించారు. కొన్ని రాష్ట్రాలు 30% కూడా లేవని, 70% నిధులు కేంద్రమే ఇస్తున్నదని చెప్పారు. జార్ఖండ్, ఒడిశా 54 శాతమేనని, కేంద్రం 46% ఇస్తే ఆ రాష్ట్రాలు బతికి బట్టకట్టాయని తెలిపారు.

స్థిరాస్తుల లెక్కలు ఎందుకు చెప్పడం లేదు?

తెలంగాణను అప్పుల రూపంలో చూపిస్తున్నారే కానీ, స్థిరాస్తుల లెక్కలు ఎందుకు చెప్పడం లేదని వినోద్‌కుమార్ నిలదీశారు. అప్పులు తెచ్చి కట్టిన ప్రాజెక్టులు, భవనాలు, సబ్‌స్టేషన్లు వంటి వాటి విలువ నేడు ఎంత మేర పెరిగిందో లెక్కలు వేసుకోవాలని సవాల్ చేశారు. కాళేశ్వరం, పాలమూరు ఎత్తిపోతలు, సీతమ్మ ప్రాజెక్టు, ఖమ్మం జిల్లాలోని భక్త రామదాసు ప్రాజెక్టులకు పెట్టిన ఖర్చుల విలువ పెరగలేదా? అని ప్రశ్నించారు. ప్రాజెక్టులు కట్టిన రోజు టన్ను స్టీల్ ధర రూ.27 వేలు ఉంటే నేడు రూ.70 వేలకు పెరిగిందని తెలిపారు. 2014-16లో భూసేకరణకు రూ.2 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు ఇస్తే రైతులు సంతోషంగా తీసుకున్నారని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం లక్షల ఎకరాలు భూసేకరణ చేసిందని వివరించారు. నేడు రూ.26 లక్షలు పెట్టినా ఎకరం భూమి దొరకదని పేర్కొన్నారు. సేకరించిన ఆస్తి తెలంగాణది కాదా? నాడు సేకరించిన భూములు నేడు ఆ ధరకు దొరుకుతాయా? అని ప్రశ్నించారు. వేల కోట్ల విలువ గల ఆస్తులు కూడబెట్టి ఇప్పటి ప్రభుత్వానికి అప్పగించామని చెప్పారు. అందుకే తెలంగాణను బంగారు పల్లెంలో పెట్టి అప్పగించినట్టు చెప్తున్నామని స్పష్టం చేశారు. అమెరికా, చైనా, జపాన్ ఎక్కువ అప్పులు తీసుకుని ఆర్థిక వ్యవస్థను నడిపిస్తున్నాయని చెప్పారు. సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు ఒక బైక్ కొనుక్కున్నా ఈఎంఐ చెల్లిస్తాయని, అంటే అప్పులు చేసినట్టు కాదని స్పష్టం చేశారు. అప్పులంటూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయవద్దని హితవు చెప్పారు. తీసుకున్న అప్పుల్లో ఒక్క ఇన్‌స్టాల్‌మెంటు కూడా ఎగ్గొట్టలేదని స్పష్టంచేశారు. అప్పులు కూడా పదేండ్ల తర్వాత తీర్చాల్సి ఉంటుందని, అయినప్పటికీ నెలనెలా చెల్లించామని చెప్పారు. సమావేశంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, నాయకులు బొల్లి రామ్మోహన్, బండ నర్సయ్య పాల్గొన్నారు.

తెలంగాణ కంటే 22 రాష్ట్రాలకు ఎక్కువ అప్పులు

తెలంగాణకు 27.8% అప్పులు ఉంటే.. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాలతో సహా 22 రాష్ట్రాలకు తెలంగాణ కన్నా ఎక్కువ అప్పులు ఉన్నాయని వినోద్‌కుమార్ వివరించారు. దీనిపై బీజేపీ ఎంపీ బండి సంజయ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌పై, కేసీఆర్‌పై అభాండాలు వేశారని, పదేపదే అసత్యపు ప్రచారాలను సోషల్ మీడియాలో వైరల్ చేసి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ప్రతి ఒక్కరి మీద రూ.5 లక్షల అప్పు చేశారంటూ కాంగ్రెస్ చేసిన అసత్యపు ప్రచారాలను తిప్పికొట్టడంలో తాము విఫలమైనట్టు పేర్కొన్నారు. బండి సంజయ్ చేసిన ఆరోపణలు పచ్చి అబద్ధమని కొట్టిపారేశారు. జీతాలు ఇవ్వడం లేదని విమర్శించే ముందు ఆ పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాల్లో మూడు, నాలుగు నెలలకోసారి ఉద్యోగులకు వేతనాలు ఇస్తున్న విషయాన్ని ఎందుకు చెప్పడం లేదని మండిపడ్డారు. ఉద్యోగుల జీతాలను బీఆర్ఎస్ ప్రభుత్వం ఏనాడూ ఎగ్గొట్టలేదని స్పష్టం చేశారు. పెద్ద ప్రాజెక్టులు కట్టినందున, వాటిపై నిధులు ఖర్చుచేసినట్టు తెలిపారు. కొత్త రాష్ట్రం ఏర్పడినపుడు విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం 7,770 మెగావాట్లు ఉంటే నేడు 26 వేల మెగావాట్లకు పెంచామని గుర్తుచేశారు.

నేడు హైదరాబాద్‌కు రాష్ట్రపతి

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము నేడు నగరానికి రానున్నారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో సాయంత్రం 5.30 గంటల నుంచి 6.45 వరకు ఆంక్షలు విధించారు. హకీంపేట్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ జంక్షన్, బొల్లారం చెక్‌పోస్టు, నెహ్రూ జంక్షన్, యాప్రాల్ రోడ్డు, హెలిప్యాడ్ వైజంక్షన్, బైసన్ గేట్, లోతుకుంట టీ జంక్షన్లు మూసేస్తున్నట్టు నగర ట్రాఫిక్ డీసీపీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయా రూట్లలో వెళ్లే వారు ప్రత్యామ్నాయ దారుల్లో వెళ్లాలని సూచించారు.

రాష్ట్రంలో వణికిస్తున్న చలి

హైదరాబాద్, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో చలితీవ్రత రోజురోజుకూ పెరుగుతున్నది. తూర్పు, ఆగ్నేయం వైపు నుంచి తెలంగాణ వైపు గాలులు వీస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాత్రి వేళల్లోనే కాకుండా పగటి ఉష్ణోగ్రతలూ పడిపోతున్నాయని, రానున్న మూడు రోజుల్లో చలి తీవ్రత మరింత పెరగనున్నదని హెచ్చరించింది. రాష్ట్రంలో చాలా చోట్ల సాధారణం కంటే 2 డిగ్రీల మేర తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్టు వెల్లడించింది. ఆదివారం పలు చోట్ల అత్యల్పంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో 13.1 డిగ్రీలు, మెదక్‌లో 14.3, రంగారెడ్డిలో 15.7, హైదరాబాద్‌లో 16.2, కరీంనగర్, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో 17 చొప్పున, నల్లగొండలో 17.4, నిజామాబాద్ 18.1, మహబూబ్‌నగర్ 20.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. గాలిలో 50 శాతం తేమ నమోదైనట్టు వాతావరణ కేంద్రం తెలిపింది. రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశాలున్నట్టు పేర్కొన్నది

బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం

బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని, సముద్రం నుంచి తమిళనాడుతోపాటు పరిసర ప్రాంతాల పైకి తూర్పు గాలులు వీస్తున్నాయని వాతావరణశాఖ వెల్లడించింది. గాలుల ప్రభావంతో ఏపీలోని దక్షిణ కోస్తా, రాయలసీమల్లో భారీ వర్షాలు కురవనున్నట్టు అమరావతి వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ఉత్తర కోస్తాలో పొడి వాతావరణం ఉంటుందని, మరో 24 గంటల్లో నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, శ్రీసత్యసాయి, బాపట్ల, గుంటూరు, ప్రకాశం, తిరుపతి, కడప జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడతాయని పేర్కొన్నారు.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	13.1°c	31.5°c
మెదక్	14.3°c	29.1°c
రంగారెడ్డి	15.7°c	29.6°c
హైదరాబాద్	16.2°c	27.8°c
కరీంనగర్	17.0°c	28.0°c
ఖమ్మం	17.0°c	29.0°c
వరంగల్	17.0°c	30.0°c
నల్లగొండ	17.4°c	28.5°c
నిజామాబాద్	18.1°c	28.5 °c
మహబూబ్‌నగర్	20.6°c	27.6°c

మన పీవీకి ఆత్మక్షోభ!

మొదటిపేజీ తరువాయి...

శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించింది. పీవీని ఉన్నతంగా గౌరవించిందీ బీఆర్ఎస్ ప్రభుత్వమే. వాస్తవాలు ఇలా ఉంటే.. కాంగ్రెస్ ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి ఆదివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదస్పదమయ్యాయి. పీవీ మరణానంతరం ఆయన కుటుంబసభ్యుల విజ్ఞప్తి మేరకే పార్థివదేహాన్ని హైదరాబాద్‌కు తరలించినట్టు జీవన్‌రెడ్డి చెప్పుకొచ్చారు. ఈ వ్యాఖ్యలపై పీవీ కుటుంబసభ్యులు భగ్గుమన్నారు. జీవన్‌రెడ్డి చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలని పీవీ కూతురు, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి కుండబద్దలు కొట్టారు. 'ఆయన పార్థివదేహాన్ని హైదరాబాద్‌కు తీసుకెళ్తామని మా కుటుంబంలో ఎవరూ చెప్పలేదు. వాస్తవానికి హైదరాబాద్‌కు తీసుకురాకుండా అడ్డుకోవడానికి ప్రయత్నించాం. కానీ, కాంగ్రెస్ పెద్దల ఆదేశం మేరకు మా ఇష్టానికి వ్యతిరేకంగా, బలవంతంగా ఆయన పార్థివదేహాన్ని హైదరాబాద్‌కు తరలించారు. ఆయనకు ఢిల్లీలో ప్రత్యేకంగా స్మారకం నిర్మిస్తామని అప్పట్లో మాకు హామీ ఇచ్చారు. కానీ ఢిల్లీలోగానీ, హైదరాబాద్‌లోగానీ ఇప్పటివరకు పీవీకి ఎలాంటి స్మారకం నిర్మించలేదు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు ఇప్పుడు ఈ విషయాన్ని లేవనెత్తాల్సిన అవసరమే లేదని స్పష్టంచేశారు. 'జీవన్‌రెడ్డి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ద్వారా మా కుటుంబ సభ్యులను తీవ్ర మనో వేదనకు గురిచేస్తున్నారు. నాటి చీకటి రోజులను మళ్లీ గుర్తుకు తెస్తూ క్షోభ పెడుతున్నారు' అని ఆవేదన వ్యక్తం చేశారు.

తలెత్తుకొని తిరుగగలరా?

నాటి ఘటనకు ప్రత్యక్ష సాక్షులుగా ఉన్న పీవీ కుటుంబసభ్యులు జీవన్‌రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబడుతున్నారు. 'చేసిన తప్పును ఒప్పుకొని క్షమాపణ చెప్పాల్సింది పోయి, కుటుంబసభ్యుల ఒత్తిడి మేరకే హైదరాబాద్‌కు తరలించారని చెప్పడం ఎంతవరకు సమంజసం? ఒకవేళ అదే నిజమైతే.. కుటుంబసభ్యుల్లో ఎవరు ఒప్పుకున్నారో జీవన్‌రెడ్డి చూపించగలరా? కనీసం ఏదైనా సాక్ష్యం ఉన్నదా? ఈ ఘటన జరిగిన సమయంలో ఆయన ఎక్కడున్నారు?' అని ప్రశ్నిస్తున్నారు. దీనిపై వారు కాంగ్రెస్‌కు చెందిన ఓ సీనియర్ నేతకు స్వయంగా ఫోన్ చేసి ఆవేదన వ్యక్తం చేసినట్టు సమాచారం. మీ రాజకీయాల్లోకి అనవసరంగా పీవీని ఎందుకు వాడుకుంటున్నారు? దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఆయన పరువు ఎందుకు తీస్తున్నారంటూ మండిపడ్డారని తెలిసింది. 'ఆ రోజు ఢిల్లీలో మాకు జరిగిన అనుభవం ఏమిటో ప్రజలకు చెప్తే.. కాంగ్రెస్ నేతలు తలెత్తుకొని తిరగలేరు. ఆరు దశాబ్దాలపాటు నిస్వార్థంగా, చిత్తశుద్ధితో పార్టీకి సేవ చేసిన వ్యక్తి పట్ల నాటి కాంగ్రెస్ అధినాయకత్వం వైఖరి బయటపడితే మీ పరువు పోతుంది' అని సున్నితంగా హెచ్చరించినట్టు తెలిసింది. దీంతో ఆ సీనియర్ నేత వారి ఆవేదన సరైనదేనని ఒప్పుకుంటూ క్షమాపణ కోరినట్టు సమాచారం. తమ పార్టీకి చెందిన నేతలు ఈ విషయంలో మాట్లాడకుండా ఉండాల్సిందని ఆ నేత అభిప్రాయపడినట్టు తెలిసింది.

అన్యాయాలపై నోరెత్తని కాంగ్రెస్

సీలేరు విద్యుత్తు కేంద్రంతోపాటు ఏడు మండలాలను కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు ధారదత్తం చేస్తే.. దీనికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ పార్టీయే పోరాడిందని దేశపతి శ్రీనివాస్ చెప్పారు. ఆనాడు రాజ్యసభలో కాంగ్రెస్‌కు 70-80 మంది సభ్యులు ఉన్నప్పటికీ తెలంగాణకు జరిగిన అన్యాయంపై మాట్లాడలేదని ఆవేదన వ్యక్తంచేశారు. అప్పుడు బీఆర్ఎస్‌కు రాజ్యసభలో ఉన్న ఏకైక సభ్యుడు కేకే మాత్రమే దీనిపై మాట్లాడారని గుర్తుచేశారు. కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కై తెలంగాణలోని ఏడు మండలాలను లాక్కున్నారని విమర్శించారు. విభజన హామీల్లో ఒకటైన కోచ్ ఫ్యాక్టరీని సాధించేందుకు కాంగ్రెస్ ఎంపీలు ఏనాడూ పార్లమెంటులో మాట్లాడలేదని విమర్శించారు. అప్పుడు ఎంపీగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాళేశ్వరం గురించి పార్లమెంటులో మాట్లాడారు కానీ రాష్ట్రానికి రావాల్సిన కోచ్ ఫ్యాక్టరీ గురించి మాట్లాడకపోవడం విచారకరమని పేర్కొన్నారు. తెలంగాణ రైతుల నుంచి వడ్లు కొనబోమని కేంద్రం చెప్పినా కాంగ్రెస్ నేతలు మాట్లాడలేదని మండిపడ్డారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాలపై పోరాటం చేసింది బీఆర్ఎస్ అయితే, పదవుల కోసం పెదవులు మూసుకున్నది కాంగ్రెస్ అని ఎద్దేవా చేశారు. హరీశ్‌రావును తిడితే మంత్రి పదవి వస్తుందని జీవన్‌రెడ్డి భావిస్తున్నట్టున్నారని, సీనియర్ నేతగా ఆయనకు మంత్రి పదవి పొందే హక్కు ఉన్నదని పేర్కొన్నారు. ఒక సీనియర్ నాయకుడిగా జీవన్‌రెడ్డిపై తనకు గౌరవం ఉన్నదని, హరీశ్‌రావుపై ఆయన చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు స్పష్టంచేశారు.

హరీశ్ మాటల్లో తప్పేముంది?: ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

తెలంగాణ బిడ్డ, మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు కాంగ్రెస్ హైకమాండ్ చేసిన అన్యాయంపై హరీశ్‌రావు మాట్లాడితే తప్పేమిటని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ప్రశ్నించారు. పీవీ కాంగ్రెస్‌వాదే అయినప్పటికీ

ఆయన్ను కాంగ్రెస్‌వాదిగా ఆ పార్టీ హైకమాండ్ గుర్తించలేదని పేర్కొన్నారు. పీవీ అంత్యక్రియలు అత్యంత అవమానకర పద్ధతుల్లో జరపడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. ఆదివారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. పీవీ వ్యవహారంలో జీవన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తిప్పికొట్టారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాంగ్రెస్ కించపరిచిందని చెప్పే సందర్భంలో పీవీని అవమానించిన తీరును హరీశ్‌రావు వివరించారని పేర్కొన్నారు. దివంగత కాంగ్రెస్ ప్రధానులకు ఢిల్లీలో స్మారక స్థలాలు ఉన్నప్పటికీ పీవీకి అక్కడ ఎందుకు నెలకొల్పలేదని ప్రశ్నించారు. పీవీ శతజయంతి వేడుకలు నిర్వహించాలని ఏ కాంగ్రెస్ నాయకుడూ అడగకపోయినప్పటికీ కేసీఆర్ తెలంగాణలో అత్యంత ఘనంగా నిర్వహించారని గుర్తుచేశారు.

వన్యప్రాణుల దాడిలో చనిపోయిన కుటుంబాలకు 10 లక్షలు

- పరిహారం ఫైల్‌పై తొలి సంతకం చేసిన అటవీశాఖ మంత్రి కొండా సురేఖ
- ఫిర్యాదులకు 'జనవాణి- కాలుష్య నివారిణి' యాప్ ప్రారంభం
- బాధ్యతలు స్వీకరించిన మంత్రి

హైదరాబాద్, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ)/అమీర్‌పేట్: వన్యప్రాణుల దాడుల్లో చనిపోయిన వారి కుటుంబాలకు ప్రస్తుతం ఇస్తున్న రూ.5 లక్షల పరిహారాన్ని ప్రభుత్వం రూ.10 లక్షలకు పెంచనున్నది. ఆదివారం బాధ్యతలు స్వీకరించిన అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ.. పరిహారం పెంచే ఫైల్‌పై తొలి సంతకం చేశారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులు త్వరలో వెలువడనున్నాయి. సచివాలయంలోని కార్యాలయంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. దేవాదాయ, అటవీ, కాలుష్య నియంత్రణ మండలి ఉన్నతాధికారులు, సిబ్బంది కార్యక్రమానికి హాజరై మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.

అటవీశాఖపై తొలి సమీక్షా సమావేశం

అటవీశాఖ కార్యక్రలాపాలపై మంత్రి కొండా సురేఖ తొలి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పథకాలు, పనులపై అటవీ సంరక్షణ అధికారి (పీసీసీఎఫ్, హెచ్‌ఓఎఫ్‌ఎఫ్) ఆర్‌ఎం డోబ్రియల్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. తెలంగాణకు హరితహారం ద్వారా ఇప్పటిదాకా జరిగిన పచ్చదనం పెంపు, వచ్చే ఏడాది లక్ష్యాలపై మంత్రి ఆరా తీశారు. కంపా నిధుల సాధన, ఈ పథకం ద్వారా చేపట్టిన పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అటవీ,దేవాదాయ శాఖలో ప్రస్తుత సిబ్బంది, కొత్తగా నియామకాలకు ఉన్న అవకాశాల గురించి ఆరా తీశారు. త్వరలోనే శాఖల వారీగా పూర్తి స్థాయి సమీక్షా సమావేశాలు చేపడతామని తెలిపారు. అట వీ, దేవాదాయ శాఖల్లోని సిబ్బంది, అధికారులు నిజాయితీగా పనిచేయాలని, జట్టుగా పనిచేసి లక్ష్యాలను సాధిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పలువురు ఎమ్మెల్యేలు, ఆయా శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

ప్రజాఫిర్యాదుల మొబైల్ యాప్ ప్రారంభం

నిర్మాణ, కూల్చివేత వ్యర్థాల నిర్వహణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నివారించడం, శబ్ద, వాహన కాలుష్య నియంత్రణ వంటి అంశాలపై తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన వాల్ పోస్టర్‌ను మంత్రి కొండా సురేఖ ఆవిష్కరించారు. పర్యావరణ కాలుష్యానికి సంబంధించి వివిధ రకాల ఫిర్యాదుల నమోదు కోసం రూపొందించిన 'జనవాణి, - కాలుష్య నివారిణి' ఆన్‌లైన్ ప్రజా ఫిర్యాదుల మొబైల్ యాప్‌ను టీఎస్‌పీసీబీ సభ్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య, ముఖ్య పర్యావరణాధికారి రఘుతో కలిసి లాంఛనంగా ఆవిష్కరించారు.

వచ్చే ఐదేండ్లలో రిటైర్మెంట్లు 44,051

మొదటిపేజీ తరువాయి...

వ్యవహరించింది. పదవీ విరమణ వయసు 58 నుంచి 61 ఏండ్లకు పెంచుతూ 2021 మార్చిలో ఉత్తర్వులు జారీచేసింది. అప్పటినుంచి ప్రభుత్వ శాఖలతోపాటు గ్రాంట్ ఇన్ ఎయిడ్ సంస్థలు, సొసైటీలు, కార్పొరేషన్లు, ఇతర సంస్థలు, వర్సిటీల్లో (బోధనేతర సిబ్బంది) ఏ ఒక్కరూ పదవీ విరమణ పొందలేదు. ప్రభుత్వ ఉద్యోగులతోపాటు సింగరేణి కార్మికుల పదవీ విరమణ వయసును సైతం 61కి పెంచింది. సింగరేణిలో కూడా మార్చి 31 నుంచి పదవీ విరమణలు ప్రారంభం కానున్నాయి.

వివిధ రాష్ట్రాల్లో వయో పరిమితి ఇలా..

- ఉద్యోగుల వయోపరిమితి పెంపు తెలంగాణతో పాటు 20 రాష్ట్రాల్లో అమల్లో ఉన్నది. మధ్యప్రదేశ్‌లో అత్యధికంగా 62 ఏండ్ల వయోపరిమితిని అమలు చేస్తుండగా, ఆ తర్వాతి స్థానంలో తెలంగాణలో 61 ఏండ్లుగా ఉన్నది.
- పశ్చిమబెంగాల్‌లో మెడికల్ ప్రొఫెసర్లకు 65 ఏండ్లు, డాక్టర్లకు 62, ఇతర ఉద్యోగులకు 60 ఏండ్ల వయోపరిమితిని అమలుచేస్తున్నారు.
- ఏపీ, త్రిపుర, కర్ణాటక, అస్సాం, బీహార్, మేఘాలయ, ఛత్తీస్‌గఢ్, నాగాలాండ్, గుజరాత్, ఉత్తరాఖండ్, యూపీ, అరుణాచల్‌ప్రదేశ్, మిజోరం, పంజాబ్, ఒడిశా, రాజస్థాన్ లో 60 ఏండ్లు ఉండగా, తమిళనాడులో 59 ఏండ్ల వయోపరిమితిని వర్తింపజేస్తున్నారు.
- హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, కశ్మీర్, మహారాష్ట్ర, గోవాలో 58 ఏండ్లు, కేరళ, జార్ఖండ్‌లో 56 ఏండ్లుగా విరమణ వయసు అమలవుతున్నది.

'ఇంజినీర్లకు న్యాయం చేయండి'

హైదరాబాద్, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు ఉద్యోగుల విభజనలో పదోన్నతులు వెనక్కి తీసుకున్న ఇంజినీర్లకు న్యాయం చేయాలని పదోన్నతులు కోల్పోయిన ఇంజినీర్లు ప్రభుత్వాన్ని కోరారు. తమకు గతంలో కల్పించిన పదోన్నతులను తిరిగి ఇప్పించాలని ఆదివారం ఒక ప్రకటనలో విన్నవించారు. గతంలో 166 మంది ఇంజినీర్లకు పదోన్నతులు కల్పించారని, ఏపీ ఉద్యోగులను ఇక్కడికి కేటాయించడంతో పదోన్నతులు కోల్పోయామని, తమకు న్యాయం చేయాలని బాలాజీ, సురేష్‌బాబు, ప్రవీణ్‌కుమార్, అంజనీరెడ్డి తదితరులు కోరారు.

వికలాంగుల సలహామండలి సభ్యుడికి డాక్టరేట్

హైదరాబాద్, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సలహామండలి సభ్యుడు నారా నాగేశ్వర్‌రావుకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. 'దివ్యాంగుల సాధికారత-కార్పొరేట్ సామాజిక బాధ్యత' అనే అంశంపై ఓయూ మేనేజ్‌మెంట్ విభాగంలో సహ ఆచార్యులైన డాక్టర్ విద్యాసాగర్‌రావు పర్యవేక్షణలో పరిశోధన సాగించి, సిద్ధాంతగ్రంథాన్ని సమర్పించగా, ఓయూ డాక్టరేట్‌ను ప్రకటించింది. నాగేశ్వర్‌రావు వికలాంగుల హక్కుల చట్టం 2016 రాష్ట్రస్థాయి నియమావళి రూపకల్పన సభ్యులుగా, వివిధ శాఖల్లో ఉద్యోగాల్లో 4% రిజర్వేషన్ కల్పనకు కృషి చేశారు. దివ్యాంగులు, బాలలు, యువజనులకు సేవలందించినందుకు జాతీయస